మే 7 నుంచి జియాగూడ రంగనాథ స్వామి ఉత్సవాలు

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి దేవస్థానంలో మూల విరాట్‌ల పునర్ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మే 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శేషాచార్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రారంభించిన ఆలయ పునరుద్ధరణ పనులు, నిర్మాణ పనులు, జీరనోద్ధరణ నేపథ్యంలో గర్భాలయంలోని మూల మూర్తుల దర్శనాన్ని నిలి తాత్కాలికంగా నిలిపి వేసి ప్రాంగణంలో బాలాలయాన్ని ఏర్పాటు చేసి శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ, అలివేలు మంగ హనుమంతుడు, అల్వరు ఉత్సవ మూర్తులను భక్తుల దర్శనార్థం ప్రతిష్ఠించారు. మే 9 నుంచి తిరిగి దర్శన సదుపాయం గర్భాలయంలో ప్రారంభిస్తామని తెలిపారు.

అభినందనలు


కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ రవికుమార్

నాంపల్లి: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్.వి. కర్ణన్‌ను నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రధాన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉండే నిలోఫర్ ఆసుపత్రికి మెరుగైన సేవలందించాలని కోరారు. ఆసుపత్రి చుట్టూ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు డాక్టర్ ఎస్.రవికుమార్ పేర్కొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన షురూ

నాంపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు వార్డు కార్యాలయాలకు భౌతికంగా 7800 దరఖాస్తులు అందినట్లు వివరించారు. ఇంకా 9000 దరఖాస్తులు అందాల్సి ఉందని తెలిపారు. అందజేయని వారు వెంటనే డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ప్రతులను సంబంధిత వార్డు కార్యాలయాల్లో జతపరచాలని కోరారు.

పాలిటెక్నిక్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

శాలిబండ: చందులాల్ బారాదరిలోని కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో వివిధ కోర్సులను పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి.వంశీ విక్రమ్ తెలిపారు. కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రిషియన్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్‌తో పాటు రాష్ట్రంలో ఉన్న ఏకైక డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సు ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి పూర్తి చేసుకున్న పాలిసెట్ అర్హత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సన్మానం



సిటీ కోర్టులు : ఇటీవల తెలంగాణ లోకాయుక్త న్యాయమూర్తిగా నియమితులైన రాజశేఖర్ రెడ్డికి మంగళవారం హైదరాబాద్-3 వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు ఎం.రాంగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్-1) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం మంగళవారం కోఠి డీఎంహెచ్ఎస్‌లోని సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. అనంతరం సాయిరెడ్డి మాట్లాడుతూ..పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్నపై జరిగిన సంఘటనపై తమ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇది వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన దాడిగా పరిగణించి ప్రిన్సిపల్ సెక్రెటరి, ఆరోగ్యశాఖ మాత్యులు తక్షణం స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలో పని చేస్తున్న హెచ్-1 నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలను ఖండిస్తున్నామన్నారు. జీఓ నెంబర్ 142 వైద్య ఆరోగ్య శాఖ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుదర్శన్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, సోమయ్య, సుజాత, సరిత, రాములు, సందీప్, శుభకరణ్ పాల్గొన్నారు.

పెరిగిన ధరలు.. తగ్గిన గిరాకీ

- గిరాకీ లేక వెలవెలబోతున్న బంగారం వ్యాపారం
- ఆకాశాన్నంటుతున్న బంగారం ధరలు
- 60 ఏళ్ల క్రితం తులం బంగారం రూ.71.75.. 2025లో లక్ష



గిరాకీ లేక వెలవెలబోతున్న గుల్జార్‌హౌజ్‌లోని బంగారం దుకాణాల సముదాయం

60 ఏళ్లుగా పెరుగుతున్న బంగారం ధరలిలా..

1965	రూ. 71.75
1970	రూ. 184
1975	రూ. 540
1980	రూ. 1,330
1990	రూ. 3,200
2000	రూ. 4,400
2005	రూ. 7,000
2010	రూ. 18,500
2015	రూ. 26,343
2020	రూ. 48,720
2024	రూ. 77,913
2025	రూ. 1,00,000

చార్మినార్: తులం బంగారం రూ.లక్ష కావడంతో వినియోగదారులతో పాటు వ్యాపారులు సైతం బెంబేలెత్తుతున్నారు. నిజాం కాలం నుంచి బంగారం వ్యాపారానికి కేరాఫ్‌గా కొనసాగుతున్న పాతబస్తీలోని బంగారం దుకాణాలు ఖరీదు చేసే వారు లేక వెలవెలబోతున్నాయి. కోట్లాది రూపాయల పెట్టుబడితో షోరూంలను నిర్వహిస్తున్న బంగారం వ్యాపారులు రోజు వారి గిరాకీ లేక తల్లడిల్లిపోతున్నారు. 1965లో 10 గ్రాముల (తులం) బంగారం రూ.71.75 ఉండగా.. 2025లో రూ.లక్ష దాటింది. దీంతో బంగారం ఖరీదు చేసే వారి సంఖ్య ప్రస్తుతం తగ్గింది. షో రూంలన్నీ వినియోగదారుల సందడి లేకుండా వెలవెలబోతున్నాయి. బంగారం రేట్లు అనూహ్యంగా పెరగడానికి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్ వాణిజ్య మార్కెట్‌పై తీసుకుంటున్న అనూహ్య నిర్ణయాలు, రష్యా-ఉక్రేయిల్ యుద్ధం, యూఎస్ ఫెడ్ రేటు, ద్రవ్యోల్బణం కారణమంటున్నారు. ఏదిఏమైనా ప్రస్తుతం వివాహాది శుభకార్యాలు జోరుగా కొనసాగుతుండడంతో బంగారానికి డిమాండ్ ఉంది. అయితే ఉన్నట్టుండి ధరలు మరీ అధికంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు సమస్యలు తలెత్తుతున్నాయి. 10 తులాలు కొనే వారు.. తప్పనిసరి పరిస్థితుల్లో 1-2 తులాలు ఖరీదు చేస్తున్నారు.

భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కొనాల్సిందే..



భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తమ బడ్జెట్‌కు అనుగుణంగా బంగారు కొనొచ్చు. డబ్బున్న వారు కొనాల్సిందే. ధరలు తగ్గుతాయెమో..అనే మీమాంస వద్దు. ధరలు తగ్గవు. పెరుగుతాయి. ఒకవేళ తగ్గినా వందలు, వేలల్లో ఉంటుంది. అంతే తప్పా..అనూహ్యంగా ధరలు తగ్గవు. ధరలు పెరిగినా..అవసరం ఉన్న వారు తప్పనిసరిగా ఖరీదు చేస్తున్నారు. అయితే అధిక మోతాదులో కొనడం లేదు. ఇంతకు ముందే ఖరీదు చేసుకున్న వారికి సమస్యలు లేవు. ఇప్పుడు పెళ్లిళ్ల సందర్భంగా కొనే వారికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
– భీమ్–భవానీ జువెల్లర్స్, గుల్జార్‌హౌజ్

బంగారం కొనేదెట్లా..?



రోజురోజుకూ బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే కొనేదెట్లా..? ముఖ్యంగా పేద మధ్య తరగతి కుటుంబాలకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. వివాహాది శుభకార్యాలకు ఎంతో కొంత బంగారం ఖరీదు చేసే మాలాంటి వాళ్లకు అనూహ్యంగా పెరుగుతున్న ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. – కొల్ల సంగీత, గృహిణి

అక్షయ తృతీయకు బంగారం ఎలా కొనాలి...



అక్షయ తృతీయకు బంగారం కొనలేని పరిస్థితులు ఉన్నాయి ఇప్పుడు. అర తులం బంగారం కొందామన్నా రూ. 50 వేలు అవసరమొస్తుంది. ఇక రెండు మూడు తులాలు ఖరీదు చేసే పరిస్థితులు ఎక్కడ ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఇప్పట్లో బంగారం తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. అందుకే ఎంతో కొంత కొనియాల్సిందే. – దర్శనం ప్రవల్లిక, అసిస్టెంట్ ప్రొఫెసర్

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం


అబిడ్స్‌లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని జీహెచ్ఎంసీ అబిడ్స్-14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య పేర్కొన్నారు. నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి అబిడ్స్, ఎంజే మార్కెట్, బషీర్‌బాగ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రజల సమస్యలను ఆయా శాఖ అధికారులు వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గం నలుమూలలా ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తాం


సంఘం ఓటరు లిస్టును విడుదల చేస్తున్న జమాల్‌పూర్ బాలరాజు తదితరులు

సుల్తాన్‌బజార్: కాచిగూడ ఆరె కటిక సంఘం (3233/2001) ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆరె కటిక ఎలక్షన్ కమిటీ చైర్మన్ జమల్‌పూర్ బాలరాజు, కార్యదర్శి డాక్టర్ నిజాంకార్ చంద్రశేఖర్ తెలిపారు. మే 4న చాదర్‌ఘాట్‌లోని విక్టరి ప్లే గ్రౌండ్‌లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఇసామియాబజార్‌లోని సంఘం కార్యాలయంలో 1234 సంఖ్య గల ఓటరు లిస్టును వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కాచిగూడ ఆరె కటిక సంఘానికి ఎన్నికల ప్రక్రియల్లో భాగంగా నామినేషన్లను స్వీకరించడం జరిగిందన్నారు. ఎన్నికల కమిటీ సంయుక్తంగా నిర్వహించిన స్క్రూటినిలో నలుగురు సభ్యులు ఎన్నికల బరిలో నిలిచారని తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్నవారిలో సాబ్నేకర్, అజయ్‌కుమార్‌కు సింహం గుర్తు, జమల్‌పూర్ పవన్‌రాజ్‌కు గడియారం గుర్తు, సాబ్నేకర్ చంద్రశేఖర్‌రు టార్చ్‌లైట్ గుర్తు, శశికాంత్‌లకు జగ్గ గుర్తులను లాటరీ పద్ధతిలో కేటాయించడం జరిగిందన్నారు. మే 4న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక్ష బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవికుమార్, మురళీధర్, జితేందర్, సంజయ్‌రాజ్, వెంకటేష్, అమర్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, ఉదయ్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విజయలక్ష్మికి నండూరి సాహిత్య పురస్కారం


పురస్కారం ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథులు

సుల్తాన్‌బజార్: పద్య కవిగా, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా తెలుగు సాహిత్యానికి విశేషమైన కృషి చేసిన నండూరి రామకృష్ణమాచార్యులు చిరస్మరణీయులని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర అన్నారు. మంగళవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవా రాయ తెలుగు భాషా నిలయంలో నవ్య సాహితీ సమితి, నండూరి రామకృష్ణమాచార్య సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య 105వ జయంతి కార్యక్రమానికి వసుంధర ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థల పక్షాన ప్రముఖ కవయిత్రి డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మికి నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఫణీంద్ర, డాక్టర్ ఆర్.పద్మనాభరావు, సాగర్‌రావు, ఆత్మకూరి గాంధీ, నండూరి గోవిందరాజులు, విద్యారణ్యస్వామి, వేమరాజు విజయ్‌కుమార్, బాలాజీశర్మతో పాటు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 12 మంది అరెస్ట్



డబీర్‌పురా: విదేశీ యూఎస్ఓ కార్డులతో పేకాట ఆడుతున్న 12 మందిని మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,340ల నగదు, 103 విదేశీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డబీర్‌పురా నూర్‌ఖాన్‌బజార్ ప్రాంతంలోని రూబీ అపార్ట్‌మెంట్‌లో అలీ అబ్బాస్, అలీ రజా, సాధిక్ అలీ ఖాన్, మీర్ షబ్బీర్ హుస్సేన్, అహ్మద్ ఆఘా, అబ్బాస్ హుస్సేన్, కరార్ హుస్సేన్, మీర్ అలీ అస్గర్ మూస్వీ, సల్మాన్, షాహెద్ ఆజా, అస్కరీ హుస్సేన్, మహ్మద్ అసద్ అలీలు సులభంగా డబ్బులను సంపాదించేందుకు విదేశీ యూఎస్ఓ కార్డులతో పేకాట ఆడుతున్నారు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మీర్‌చౌక్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,340ల నగదు, 103 విదేశీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

జూన్ 26 నుంచి కోట బోనాలు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు జూన్ 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని గోల్కొండ జగదాంబిక మహంకాళి వృత్తిపని సంఘం వారి మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి తెలిపారు. కోట బోనాల్లో అమ్మవారికి మొత్తం తొమ్మిది పూజలు జరుగుతాయని ఇందులో భాగంగా జూన్ 26న మొదటి పూజ, 29న రెండో పూజ, జూలై 3న మూడో పూజ, 6న నాల్గొవ పూజ ఉంటుందన్నారు. అదే విధంగా 10న ఐదో పూజ, 13న ఆరో పూజ, 17న ఏడో పూజ, 20న ఎనిమిదవ పూజ జరుగుతుందని తెలిపారు. 24న తొమ్మిదవ పూజ ఉంటుందని పేర్కొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో రూ.5 భోజనానికి విశేష స్పందన

గోల్కొండ: స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో కొనసాగుతున్న రూ.5 భోజన పథకానికి విశేష స్పందన వస్తుంది. ఆసుపత్రికి వచ్చే ఔట్‌పేషంట్లు, రోగుల సంఖ్య పెరగడంతో పాటు ఇన్‌పేషంట్ల బెడ్ల సంఖ్య పెరగడంతో ఇన్‌పేషంట్ల సహాయకుల సంఖ్య కూడా బాగా పెరిగింది. దీనికి తోడు ఈ ఆసుపత్రికి కార్వాన్, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, షేక్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి పేషంట్లు వస్తుంటారు. పేద బడుగు వర్గాలకు చెందిన వారికి ఈ భోజన పథకం వరంలా మారింది. ఉదయం ఇడ్లీ, ఉప్మా, మధ్యాహ్నం భోజనం మళ్లీ, రాత్రి భోజనం కూడా రూ.5కే ఇస్తుండడంతో వచ్చిన భోజనం వచ్చినట్లుగానే అయిపోతుంది. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ కోసం పంపే భోజన పదార్థాల సంఖ్యను పెంచమని కోరామని ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాసరావు 'సాక్షి'తో అన్నారు. ఉదయం కొద్ది సేపట్లోనే అయిపోతుందని గత్యంతరం లేక పేషంట్ల సహాయకులు బయట నుంచి తెప్పించుకుంటున్నారన్నారు.

'యాదవ సంఘం స్థలాన్ని కాపాడుకుంటాం'

గోల్కొండ: కార్వాన్ యాదవ సంఘానికి చెందిన స్థలాన్ని కొందరు కబ్జాదారులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సంఘం ప్రతినిధులు ఆరోపించారు. మూడు దశాబ్దాల క్రితం ఈ స్థలం కార్వాన్ యాదవ సంఘానికి కేటాయించడం జరిగిందని, గత కొన్ని రోజుల క్రితం ఈ స్థలంలో ఈ జాగా మాది అంటూ కొందరు కబ్జాదారులు కరెంటు మీటర్ ఏర్పాటు చేశారన్నారు. దీంతో మంగళవారం కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బొడి అశోక్‌కుమార్‌యాదవ్, సంఘం సభ్యులతో మెహిదీపట్నం విద్యుత్ శాఖ ఏడీఈ గణేష్‌ను కలిశారు. ఈ స్థలంలో మీటర్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఎలా ఇచ్చారు, దరఖాస్తు చేసుకునే వ్యక్తి స్థలానికి చెందిన డాక్యుమెంట్లు సమర్పించాడా అని ఏడీఈని అడిగారు. వెంటనే ఆ మీటర్‌ను తొలగించాలని ఆయన కోరారు.

ఉగ్రదాడులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ



దుకాణాలను మూసివేసి నిరసన ర్యాలీ నిర్వహించిన వ్యాపారస్థులు

అబిడ్స్: ఉస్మాన్‌గంజ్ మార్కెట్‌లో వ్యాపారస్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఉస్మాన్‌గంజ్‌లోని అల్లం వెల్లుల్లి, ఆలుగడ్డ, మిర్చి వ్యాపారస్థులు తమ దుకాణాలను మూసివేసి పాకిస్తాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు చంద్రమోహన్, గుబ్బ సురేష్, మదుసుధన్, నరేందర్ గుప్తా, శివకుమార్, పెద్ద ఎత్తున హమాలీలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో క్యాండిల్ ర్యాలీ..

గోల్కొండ: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మంగళవారం షేక్‌పేట్‌లో అన్ని పార్టీల ఆధ్వర్యంలో పీస్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారు ఒక చేతిలో క్యాండిల్స్, మరో చేతిలో తిరంగా జెండాలు పట్టుకొని పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంఏ బేగ్, మహ్మద్ ముస్తఫా, రఘు, మహ్మద్ గౌస్, మహ్మద్ అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.


షేక్‌పేట్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

'కేంద్రీయ విద్యాలయాలు ప్రతిభకు నిలయాలు'


బ్రిగేడియర్ రాహుల్ తాప్రియాల్‌కు మొక్కను అందజేస్తున్న విద్యార్థులు

గోల్కొండ: ప్రధానమంత్రి కేంద్రీయ విద్యాలయాలు ప్రతిభకు నిలయాలు అని ఆర్టిలరీ సెంటర్ బ్రిగేడియర్ రాహుల్ తాప్రియాల్ అన్నారు. కేంద్రీయ విద్యాలయ-1 గోల్కొండలో విద్యాలయాల రీజినల్ అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనకు మొక్కను అందించి స్వాగతం పలికారు. చదువుతో పాటు వివిధ క్రీడాంశాల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన అన్నారు. ఈ కారణంగానే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులే పతకాలు సాధిస్తారన్నారు. అండర్-17 మూడు వేల మీటర్ల రేస్‌లో సహస్రా శెట్టి, విజయవాడ కేంద్రీయ విద్యాలయానికి చెందిన వినీత్ అండర్-17లో బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా అండర్-19 బాలికల 300 మీటర్ల రేస్‌లో విజయనగరం కేంద్రీయ విద్యాలయానికి చెందిన సునీత బంగారు పతకాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్యాంరావు ముదిరాజ్‌కు శ్రమశక్తి అవార్డు


అవార్డును అందుకుంటున్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: 25 ఏళ్లుగా పాతబస్తీలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ గ్రేటర్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్‌కు ఉగాది శ్రమశక్తి అవార్డు లభించింది. కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ మాజీ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాజ్ నారాయణ ముదిరాజ్ మంగళవారం రవీంద్ర భారతీలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

అబిడ్స్: సంఘ సేవకుడు జెమ్స్ గగరిన్ తరహాలో అందరూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని జైన్ సేవా సంఘ్ అధ్యక్షుడు అమృత్‌కుమార్ జైన్, విద్యావేత్త సూరెపల్లి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం అబిడ్స్ రాఘవరత్న టవర్‌లో నవ భారత్ నిర్మాణ్‌సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘ సేవకుడు జెమ్స్ గగరిన్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..30 ఏళ్లుగా జెమ్స్ గగరిన్ సమాజ శ్రేయస్సుకు చేసిన కృషిని వారు కొనియాడారు.


జెమ్స్ గగరిన్‌ను సత్కరిస్తున్న అమృత్‌కుమార్ జైన్, సూరెపల్లి రవికుమార్

పూల్‌బాగ్ హౌసింగ్ కాలనీలో 33 ప్లాట్లు స్వాధీనం


పూల్‌బాగ్‌లో పోలీసు బందోబస్తు

అబిడ్స్: పూల్‌బాగ్‌లో జేఎస్ఎన్‌యూఆర్ఎం హౌసింగ్ కాలనీలో అక్రమంగా ఆక్రమించిన 33 ప్లాట్లను నాంపల్లి తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వాధీనపరచుకున్నారు. మంగళవారం భారీ ఎత్తున పోలీసులను పోలీసు బందోబస్తు మధ్య అక్రమంగా ఉంటున్న వారిని బయటకు పంపించి 33 ప్లాట్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..గతంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పూల్‌బాగ్ కాలనీలో మొత్తం 608 ప్లాట్లు నిర్మించబడ్డాయని వివరించారు. అందులో 33 ప్లాట్లు అక్రమదారులు ఆక్రమించుకున్నారని తాము గుర్తించి వారిని బయటకు పంపించి ఆ ప్లాట్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నాంపల్లి తహసీల్ సిబ్బంది విశ్వేశ్వర్, శేషు, నరేష్, శేఖర్, అశ్విని కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు

గోల్కొండ: హకీంపేట్‌లోని అజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ అహ్మద్ జిలానీ హకీంషా బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పూల ఛాదర్, దట్టీ సమర్పించారు. ఆయన వెంట దర్గా నిర్వహణ కమిటీ ప్రతినిధులు, ఉర్సు కమిటీ ప్రతినిధులు, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.


ఉర్సులో దట్టీ మోసుకెళ్తున్న ఎమ్మెల్యే కౌసర్

గృహిణి అదృశ్యం


షమీమ్ బేగం

గౌలిపురా: గృహిణి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన అబ్దుల్ అలీమ్, షమీమ్ బేగం (30)లు దంపతులు. 12 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా షమీమ్ మానసిక వ్యాధితో బాధపడుతుండటంతో తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 28న షమీమ్ బేగం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదరు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తన కూతురు కనిపించడం లేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273